ఏం కొనేటట్టు లేదు..
ఏం తినేటట్టు లేదు..!

- రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు
- మండుతున్న కూరగాయలు
- సామాన్యులకు ఇబ్బందులు

నిత్యావసర వస్తువులు	(మే)	(అక్టోబర్)
బియ్యం (సూపర్ ఫైన్)	55	65
బియ్యం సాధారణ	53	57
గోధుమ పిండి	45	76
పచ్చి శెనగపప్పు	85	119
పెసర పప్పు	127	139
కందిపప్పు	166	180
మినప పప్పు	160	168
ఉప్పు ప్యాకెట్టు	25	28
వేరు శెనగ నూనె	155	180
సన్ ఫ్లవర్ (15 కిలోలు)	1750	2200
పామాయిల్ (15కిలోలు)	1700	2200
చింతపండు	110	165
ఎండు మిర్చి	150	240
వెల్లుల్లి	250	440


వివిధ రకాలైన కూరగాయలు


కె.జె.పురంలో విక్రయిస్తున్న కూరగాయలు

మాడుగుల రూరల్ : పెరిగిన నిత్యావసర వస్తువులతో సామాన్యులు బెంబేలు పడుతున్నారు. ఒక వైపు నిత్యావసర వస్తువులు, మరో వైపు కూరగాయలు ధరల పెరుగుదలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఈ ఏడాది మే మాసంతో చూస్తే, ఈ నెలలో నిత్యావసర వస్తువులు, కూరగాయలు ధరలు భారీగా పెరిగాయి. దీంతో సామాన్యులు వస్తువులు కొనలేక, తినలేక ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని జనం గగ్గోలు పెడుతున్నారు. గ్యాస్, వంట నూనెలు, ఇతర నిత్యావసర వస్తువులు ధరల మండుతున్నాయి. గతంలో పది రూపాయలకు ఇద్దరు కుటుంబ సభ్యులకు సరిపడే కూరగాయలు వచ్చేవి. నేడు పది రూపాయలు బేరం లేదు. కిలోల బేరం మాత్రమే.

ధరల అదుపునకు చర్యలేవీ..

పెరిగిన నిత్యావసర వస్తువులను క్రమబద్ధీకరిస్తున్నామని అధికారులు ప్రకటనలు ఇచ్చారు తప్ప ఆచరణలో ఎటువంటి చర్యలు తీసుకోలేదు. సరకుల కృత్రిమ కొరత సృష్టించకుండా తనిఖీలు చేసి ధరలు అదుపు చేస్తామన్న హామీలు నెరవేరడం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో వరి సాగు చేస్తున్నారు. దీంతో ఎక్కడో దూర ప్రాంతాల్లో పండించిన కూరగాయలను అనకాపల్లి మార్కెట్టు నుంచి కొనుగోలు చేసి, వ్యాపారులు గ్రామాల్లోకి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. దీంతో పాటు పెరిగిన ధరలతో కూరగాయలు, నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయలేక జనం సతమతమవుతున్నారు.

ఈ ఏడాది మే నెలతో పోలిస్తే ఆక్టోబరు మాసంలో కూరగాయలు ధరల్లో తేడాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

కూరగాయలు (కిలో ధర రూ.ల్లో)	మే	అక్టోబర్
టమాటా	28	110
ఉల్లిపాయలు	25	80
బంగాళాదుంపలు	35	60
బెండకాయలు	35	70
దొండకాయ	36	70
వంగ	30	70
సొరకాయ 1	25	40
బీరకాయ	45	90
క్యారెట్	45	90
బీన్స్	50	120
క్యాప్సికమ్	45	100
కాకర	40	80
లోకల్ చిక్కుడు	80	125
గోరు చిక్కుడు	40	60
పచ్చి మిరప	40	60
కొత్తిమీర కట్ట పెద్దది	10	50
ఆకుకూరలు (5 కట్టలు)	15	60

రేషన్ డిపోల్లో సరుకులు అందించాలి



కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు గత మూడు మాసాల్లో భారీగా పెరిగాయి. దీంతో కొనలేక ఇబ్బందులు పడుతున్నాం. బహిరంగ మార్కెట్‌లో ధరల తగ్గింపునకు అధికారులు చర్యలు చేపట్టాలి. ఉల్లిపాయలు, తదితర నిత్యావసర వస్తువుల ధరలు రేషన్ డిపోల ద్వారా విక్రయించాలి

–బి. వెంకట్రావు, కె.జె.పురం గ్రామం, మాడుగుల మండలం

సామాన్యులకు భారం



నిత్యావసర వస్తువులు, ఇతర కూరగాయల ధరల తగ్గింపునకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల పాలనలో మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటున్నారు. కానీ 100 రోజుల్లో పెరిగిన ధరల వల్ల సామాన్యుడు ఇబ్బందులు పడుతున్నాడు.

–సకలా సూరిబాబు, వంటర్లపాలెం, మాడుగుల మండలం

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పసలమారమ్మ పండగ

కె.కోటపాడు : మండలంలో చౌడువాడ గ్రామస్తులు ఆదివారం పసల మారమ్మ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సతకంపట్టు వద్ద గల పోతురాజు గుడి వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం వసంతకోత్సవంతో గ్రామస్తులు ఊరేగింపు జరిపారు. రైతులు ఈ వసంతకాన్ని పొలాల్లోను, పశువులపైనా, పశువుల పాకల్లోను చల్లారు. పంటలు మంచి దిగుబడితో పండడంతో పాటు పశువులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఏటా ఖరీఫ్ కాలంలో ఈ పండగ చేస్తారు.

కృష్ణదేవిపేట ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

గొలుగొండ : కృష్ణదేవిపేట ఎస్ఐగా తారకేశ్వర్రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఇక్కడికి రావడం జరిగింది. ఇక్కడ 20 రోజుల క్రితం ఎస్ఐగా దివ్య బాధ్యతలు స్వీకరించగా ఆమెను మళ్లీ జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ తారకేశ్వర్రావు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

రూ.35 వేలకు లడ్డూ దక్కించుకున్న సర్పంచ్


వేలంలో దక్కించుకున్న లడ్డూతో సర్పంచ్ వెంకటరమణ

మాకవరపాలెం: దుర్గమ్మ మండపంలో పూజలందుకున్న లడ్డూను బూరుగుపాలెం సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ రూ.35 వేలకు దక్కించుకున్నారు. ఈ గ్రామంలో శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గమ్మ మండపం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తొమ్మిది రోజులపాటు పూజల అనంతరం శనివారం రాత్రి లడ్డూ వేలం నిర్వహించారు. ఈ వేలంలో సర్పంచ్ వెంకటరమణ రూ.35 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. కాగా మండలంలో దసరా వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. నవరాత్రులు ముగియడంతో వైభవంగా ఊరేగింపు చేసి నిమజ్జనం చేశారు. తూటిపాలలో కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నిర్మాణ కార్మికులకు గృహోపకరణాల పంపిణీ


గృహోపకరణాలు, వస్త్రాలను అందిస్తున్న ఎస్ఐ ధనుంజయ్, సూర్యనారాయణ

కె.కోటపాడు : కార్మికుల కుటుంబాల్లో దసరా సమయాల్లో ఆనందం నింపేందుకు సొంత నగదుతో సేవా కార్యక్రమాలను చేస్తున్న రావాలమ్మ తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు కన్నూరు సూర్యనారాయణ అభినందనీయుడని కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ అన్నారు. కింతాడకు చెందిన సూర్యనారాయణ తన సొంత నగదు రూ.3లక్షలతో 80 మంది సంఘంలో గల భవన నిర్మాణ కార్మికులకు ఆదివారం గృహోపకరణాలతో పాటు బట్టలు, చీరలను అందించారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని ఎస్ఐ ధనుంజయ్ చేతుల మీదుగా నిర్వహించారు. తోటి వారికి సహాయ పడాలనే మంచి ఆకాంక్ష ఉన్న కన్నూరి సూర్యనారాయణ పలువురికి స్ఫూర్తిదాయకుడని ఎస్ఐ పేర్కొన్నారు. గృహోపకరణాలు అందించిన సూర్యనారాయణకు కార్మికులు కృతజ్ఞతలను తెలిపారు.

నిధులు మంజూరైనా రోడ్లు వేయరేం?

రోలుగుంట : మండలంలో గల గిరిజన గ్రామాలకు రహదారులు కావాలని పోరాడి సాధించుకున్న గ్రామాల్లో సత్వరమే శంకుస్థాపన చేసి రోడ్డు పనులు ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యవర్గం సభ్యుడు కె.గోవింద, మండల కార్యదర్శి ఈ.చిరంజీవి డిమాండ్ చేశారు. మండలంలో ఎంకె.పట్నం నుంచి కొరుప్రోలు వరకూ ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.1.50 కోట్ల నిధులు, వై.బి.పట్నం నుంచి లోసింగి మీదుగా పెదగరువు వరకూ రూ.2.50 కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఆయా గ్రామాల్లో వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయాలని బాధిత గ్రామాల వారు కోరారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336
సాక్షి

మద్యం షాపులకు 292 దరఖాస్తులు

మాడుగుల రూరల్ : మాడుగుల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో 292 దరఖాస్తులు వచ్చాయని మాడుగుల ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సిహెచ్.వి.ఎస్. ప్రసాద్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలతో దరఖాస్తు గడువు ముగియడంతో కొత్త మద్యం పాలసీ కింద మాడుగుల మండలంలో ఐదు షాపులకు 88 దరఖాస్తులు, చీడికాడ మండలంలో 3 షాపులకు 99 దరఖాస్తులు, రావికమతం మండలంలో 5 షాపులకు 105 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఈ నెల 14న జిల్లా కలెక్టర్ సమక్షంలో అనకాపల్లిలో లాటరీ తీస్తారని, ఈ లాటరీలో విజేతలైన వారు ఈ నెల 16తేదీ నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభిస్తారని తెలిపారు.

విస్తారంగా కర్రపెండలం పంట సాగు


గరుగుబిల్లిలో కర్ర పెండలం పంట

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో ఖరీఫ్ సాగులో భాగంగా కర్రపెండలం పంటను విస్తారంగా రైతులు సాగు చేస్తున్నారు. ప్రధానంగా ఈ పంటను మెట్ట ప్రాంత గ్రామాలైన గరుగుబిల్లి, గొండుపాలెం, దాలివలస, కొరువాడ, డి.అగ్రహారం, ఆర్లి, పిండ్రంగి గ్రామాల్లో 80 ఎకరాలలో సాగుచేస్తున్నారు. మెట్ట ప్రాంత గ్రామాలలో గల భూములు ఈ పంటకు అనుకూలంగా ఉండనుండడంతో కర్రపెండలం దుంపలు దిగుబడి అధికంగా ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు పంటకు మేలు చేస్తాయన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న కర్ర పెండలం సాగు కోత దశకు చేరుకుందని రైతులు తెలుపుతున్నారు.

జనవరిలో నాతవరంలో శ్రీనివాస కల్యాణం

- టీటీడీ పండితులతో నిర్వహణకు ఏర్పాట్లు
- పోస్టర్ విడుదల


శ్రీనివాస కల్యాణం పోస్టరు విడుదల చేస్తున్న మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీలు, నాయకులు

నాతవరం : మండల కేంద్రంలో సంక్రాంతికి తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులతో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్నామని ఎన్ఆర్ఐ శెట్టి శిరీష్ తెలిపారు. దీనికి సంబంధించి పోస్టర్‌ను విజయదశమి పండగ సందర్భంగా శ్రీశక్తి పంచాయతన ఆలయంలో మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, నేతల విజయకుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ విడుదల చేశారు. ఉత్సవ వివరాలు వెల్లడించారు. జనవరి 10వ తేదీన శ్రీవారి ఆనంద నిలయంలో ఉత్తర ద్వార దర్శనం, 11న సుప్రభాత సేవ నుంచి పవళింపు సేవ వరకు తిరుపతిలో స్వామి వారికి ఉదయం నుంచి రాత్రి వరకు జరిగే అన్ని రకాలు సేవలు ఇక్కడి భక్తులకు కళ్లకు కట్టినట్టుగా తిరుమల వేద పాఠశాల అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. ఇంతవరకు మండలంలో ఎక్కడ కూడా శ్రీనివాస కల్యాణం జరగలేదన్నారు. శ్రీనివాస కల్యాణంలో పూజ చేయించుకునే భక్తులు ముందుగా ఆలయం వద్ద తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, శ్రీశక్తి పంచాయతన ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గౌరీపట్నం రోడ్డులో తుప్పలు తొలగించరూ..!


వడ్డాది,గౌరీపట్నం రోడ్డును ఆనుకుని ఉన్న మొక్కలు

బుచ్చెయ్యపేట : మండలంలోని వడ్డాది–గౌరీపట్నం ఆర్అండ్‌బీ రహదారిలో జంగిల్ క్లియరెన్స్ చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. భీమునిపట్నం, నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో వడ్డాది పెద్దేరు నది, విజయరామరాజుపేట తాచేరు వంతెనలు కూలిపోయాయి. ఆయా చోట్ల వేసిన తాత్కాలిక డైవర్షన్ రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహించినా, ట్రాఫిక్ సమస్య వచ్చినా పలువురు వాహనదారులు ప్రత్యామ్నాయంగా వడ్డాది, గౌరీపట్నం రోడ్డుపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ రోడ్డుకి ఇరువైపులా ఏపుగా తుప్పలు, డొంకలు పెరిగిపోయాయి. సింగిల్ రహదారి కావడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునేందుకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది. ప్రమాదాలకూ కారణం అవుతోంది. ఈ మేరకు రహదారికి ఇరువైపులా తుప్పలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఘనంగా ముగిసిన దసరా సంబరాలు

- ఆకట్టుకున్న బొమ్మలు కొలువులు
- ఆకర్షణగా సాంస్కృతిక కార్యక్రమాలు


మాడుగులలో పూలు, నగలతో ప్రత్యేక అలంకరణలో దేవీతల్లి


కె.జె.పురం కళావేదిక వద్ద అమ్మవారు

మాడుగుల : మాడుగులలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా శనివారం రాత్రితో ముగిసాయి. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా జమ్మి కొమ్మలు రాజులు వాడిన ఆయుధాలు అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. నూతన వాహనాలకు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయం వద్ద మహిళల కోలాటాలు, దసరా పాక వద్ద నిర్వహించిన సత్యహరిశ్చంద్ర నాటకం, జీసీసీ గొడౌన్ వద్ద, మహారాజు కోట బయట నిర్వహించిన పలు నృత్య పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయంలో బొమ్మల కొలువులు చిన్నారులను ఆకట్టుకున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. దసరా ఉత్సవాలు సివిల్ ఆర్‌టీసీ మోటార్ యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి.

నాతవరం : విజయ దశమి వేడుకలను భక్తులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక శ్రీశక్తి పంచాయతన ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రీదుర్గాదేవి ప్రతిమ వద్ద నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించి ఆదివారం నిమజ్జనం చేశారు. ఎ.శరభవరం, వెదురుపల్లి, సిద్దిపట్నం, వెదురుపల్లి, రాజుపేట అగ్రహారం, గన్నవరం గ్రామాల్లో గల శ్రీ దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దసరా పండగ రోజున అమ్మవారిని దర్శించుకునేందుకు శనివారం తెల్లవారు నుంచే అధిక సంఖ్యలో భక్తులు క్యూలో నిల్చొని పసుపు, కుంకుమ, జాకెట్టు ముక్క సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నాతవరంలో శ్రీ శక్తి పంచాయతన ఆలయం వద్ద అన్న సమారాధన జరిపారు.

కె.కోటపాడు : మండల గ్రామాల్లో విజయదశమి పర్వదినాన్ని శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పూజలు జరపడంతో పాటు వాహనాలకు యజమానులు ప్రత్యేక పూజలను జరిపారు. గొండుపాలెం గ్రామానికి చెందిన భక్తులు, భవానీ మాలధారులు దీపపు ఘటాలను తలపై ధరించి ఊరేగింపు జరిపారు. అనంతరం అమ్మవారి విగ్రహ అనుపు కార్యక్రమాన్ని పూర్తి చేసారు. కె.కోటపాడు, గుల్లేపల్లి గ్రామాల్లో దేవీ మండపాల వద్ద విజయదశమి పర్వదినం సందర్భంగా కుంకుమ పూజలు జరిపారు. అనంతరం అనుపు పూర్తి చేశారు.


గొండుపాలెంలో దీపాల ఘటాలతో భవానీ మాలధారులు, గ్రామస్తులు

మాడుగుల రూరల్ : శరనవరాత్రి ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిసాయి. వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున గల కనకదుర్గమ్మ ఆలయంలో తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలు నిర్వహించారు. అలాగే ఎం.కోటపాడు రామాలయంలో అమ్మవారిని ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. శనివారం భవానీ భక్తుల సారథ్యంలో ట్రాక్టరు మీద అమ్మవారిని ఊరేగించి నిమజ్జనోత్సవం జరిపారు. శక్తి వేషాలు, నేల నృత్యాలతో వైభవంగా ఊరేగింపు సాగింది. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శానాపతి కొండలరావు, వల్లాపురం, ఎం.కోటపాడుకు చెందిన ప్రజా ప్రతినిధులు, భవానీ భక్తులు పాల్గొన్నారు. కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు అష్టలక్ష్మి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కె.జె.పురం కళావేదిక మీద ప్రతిష్ఠించిన అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా జిల్లా స్థాయి ఎడ్ల పోటీలు

చీడికాడ : మండలంలోని గ్రామగ్రామాన దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిసాయి. అప్పలరాజుపురం లలితా దేవి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భారీగా అన్న సమారాధన జరిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు, ఎంపీపీ కురచా జయమ్మ నారాయణమూర్తి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సోమునాయుడు, గండి జగన్నాథంనాయుడు, కురచా శ్రీను, అచ్చంనాయుడు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : దసరా మహోత్సవాలు ముగిసాయి. ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు 12 తో ముగిశాయి. సీతయ్యపేట, బుచ్చెయ్యపేట ఆలయాలతో పాటు వడ్డాది, తురకలపూడి, గున్నెంపూడి, దిబ్బిడి, విజయరామరాజుపేట, లోపూడి, ఆర్.భీమవరం, ఎంబీపాలెం, రాజాం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు, క్షీరాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో వేలాది మంది భక్తులు భవానీ మాలలు ధరించి తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించారు. శనివారం దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా భారీ మందుగుండు, నేల డాన్స్‌లు, డప్పుల వాయిద్యాల నడుమ అమ్మ


దసరా ఉత్సవాల్లో భాగంగా మాడుగుల దేవీతల్లిని దర్శించుకుంటున్న భక్తులు


సత్య హరిశ్చంద్ర నాటకంలో ఓ సన్నివేశం

రోలుగుంట : స్థానిక నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో భక్తులు శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ నెల 3న ప్రారంభమైన ఈ ఉత్సవాలు శనివారం రాత్రి అమ్మవారి నిమజ్జనోత్సవంతో ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు భవానీ మాలధారులు నిష్ఠతో మండపాన్ని శుద్ధి చేసి అమ్మవారికి ఇష్టమైన భక్తిగీతాలు వినిపించారు. ముగింపురోజు శనివారం రాత్రి అమవారిని వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఊరేగింపులో పలు నృత్యాలు, శక్తినృత్యాలు, మహిళల కోలాటం, బాణసంచాతో ఊరేగించి కోనేరులో నిమజ్జనం చేశారు.

దేవరాపల్లి :

దసరా ఉత్సవాలను గ్రామగ్రామాన ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. దసరాను పురస్కరించుకొని వాహనాలు, యంత్రాలకు, మోటార్లకు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో నెలకొల్పిన దుర్గాదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నాగయ్యపేట, సీతంపేట గ్రామాల్లో దుర్గాదేవి నిమజ్జన మహోత్సవాన్ని పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. దుర్గాదేవి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించి అనంతరం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


దేవీ ఆలయంలో భక్తజనం


మాడుగుల బస్టాండ్‌లో ఆకర్షణీయ విగ్రహాలు


దసరా ఉత్సవాల్లో భాగంగా ఆకట్టుకున్న కోలాటాలు


దేవరాపల్లి : సీతంపేటలో దుర్గాదేవి ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం


రోలుగుంట గ్రామవీధుల్లో అమ్మవారి ఊరేగింపు


ఆకట్టుకున్న శక్తి వేషధారణ నృత్యం


లోపూడిలో అమ్మవారి అనుపోత్సవంలో పాల్గొన్న భక్తులు


దిబ్బిడిలో అమ్మవారి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు


సీతయ్యపేటలో అమ్మవారి సంబరంలో పాల్గొన్న భక్తులు


లలితాదేవి ఆలయం ధ్వజ స్తంభం వద్ద మహిళల పూజలు


జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు


ఎం.కోటపాడులో అమ్మవారి ఊరేగింపు


నాతవరంలో అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు